క్లుప్తంగా

మురుగు నిల్వలేకుండా చర్యలు చేపట్టండి



ఆర్‌యూబీలో మురుగును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరమణయ్య

గుంతకల్లుటౌన్: పట్టణంలోని గుంతబావి వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలో మురుగు నిల్వ లేకుండా ఉండేందుకు రైల్వే అధికారులతో చర్చించి శాశ్వత చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఇంజినీర్లకు సూచించారు. మంగళవారం కమిషనర్, ఎంఈ గురప్పయాదవ్ గుంతబావి వీధిలో సమస్యను పరిశీలించారు. వర్షాకాలం వస్తే ఆర్‌యూబీలో నుంచి రాకపోకలు జరగవని, అలా కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. అనంతరం ఆలూరు రోడ్ వద్ద జరుగుతున్న పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈలు, ఏఈలు, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



నగదు అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ట్రిబుల్ ఎస్ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థి కావ్యకు రూ.5 వేలు, కౌసల్యకు రూ.3 వేలు, కార్తీక్‌కు రూ.2వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ ట్రైనింగ్ పార్టనర్‌గా గేట్స్ కళాశాల



గేట్స్ కళాశాలతో ఒప్పందం చేసుకుంటున్న ఇన్ఫోసిస్ ప్రతినిధులు

గుత్తి: ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్ ట్రైనింగ్ పార్టనర్‌గా గుత్తి గేట్స్ కాలేజీ ఎంపికైంది. మంగళవారం గేట్స్ కాలేజీతో ఇన్ఫోసిస్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు పరస్పరం ఒప్పంద పత్రాలు ఇచ్చుకున్నారు. ఇక నుంచి గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో చదివే విద్యార్థులకు ఇన్ఫోసిస్ కంపెనీ ప్రతినిధులు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ ఎండీ రఘునాథ్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏబీవీపీ నాయకులు

తాడిపత్రి అర్బన్: స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో సోమవారం అఖిల భారత్ విద్యార్థి పరిషత్ 76వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుడు, సరస్వతీ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఏబీవీపీ తాడిపత్రి బాగ్ కన్వీనర్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞానం, శీలం, ఏకాగ్రత నింపుతూ నేషన్ ఫస్ట్, సెల్ఫ్ నెక్స్ట్ అనే జాతీయ భావాలను, దేశభక్తిని పెంపొందిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సాయి కార్తీక్, దేవేంద్ర, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి పూజలు



అలంకరణలో రాజరాజేశ్వరి దేవి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో వెలసిన రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో భక్తులు దీపాలు పెట్టి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

మున్సిపాలిటీలో కంపు.. కంపు

- అస్తవ్యస్తంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ
- మున్సిపల్ చైర్మన్ జేసీ వార్డులో మురుగు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కాల్వగడ్డ వీధిలో రోడ్డుపై మురుగు ఇలా..



మురుగులో పంది తిరుగుతున్న దృశ్యం



లీకేజీ అవుతున్న అండర్ డ్రైనేజీ పైప్‌లైన్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మున్సిపాలిటీ కంపు కొడుతోంది. అండర్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. తాడిపత్రిలోని కాల్వగడ్డ వీధిలో రోడ్లపై మురుగు ప్రవహిస్తుండటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని 24 వార్డు నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎన్నికై మున్సిపల్ చైర్మన్ పదవి అనుభవిస్తున్నారు. ఓట్ల కోసం కాలనీ సమస్యలు తీర్చి అభివృద్ధికి పాటు పడతానన్న ఆయన మాటలు వట్టిమాటలయ్యాయని.. నెలలు తరబడి మురుగునీ రోడ్లపై ప్రవహిస్తున్నా పట్టించుకున్న వారే కరువయ్యారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలని పలు వార్డుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మురుగులో పందులు స్వైర వీహారం చేస్తుండటంతో వీధుల్లో నడవలేని దుస్థితి నెలకొంది. మురుగు నిలిచి ఉండటంతో కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతుండటంతో కాలనీ వాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో మురుగు సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గుంతకల్లులో ఫ్యాక్షన్ బీజాలు నాటొద్దు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బోయ సుంకప్ప

గుంతకల్లుటౌన్: ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన గుంతకల్లులో ఫ్యాక్షన్ బీజాలు నాటి శాంతికి భంగం కలిగించొద్దని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బోయ సుంకప్ప టీడీపీ నేతలకు హితవు పలికారు. ఒక్కరోజు అవకాశమిస్తే వైఎస్సార్‌సీపీ నేతల కథ చూస్తానని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడుసార్లు కౌన్సిలర్‌గా గెలిచిన చరిత్ర తనదన్నారు. కనీసం వార్డు సభ్యుడిగా, సర్పంచ్‌గా గెలవలేని నారాయణ బెదిరిస్తే భయపడే వారెవ్వలేరన్నారు. ధోనిముక్కల రోడ్డులో తమ కుటుంబానికి 30 ఎకరాల పొలముండేదని, అందులో 24 ఎకరాల డీ–పట్టా భూమిని దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదల ఇళ్లస్థలాల కోసం ప్రభుత్వానికి అప్పగించామన్నారు. దేవాలయాలు, పీర్లచావిడి, జెండాకట్టలకు స్థలాల్ని దానం చేసిన తమకు పేదల స్థలాలు కబ్జా చేయాల్సిన ఖర్మ పట్టలేదన్నారు. ఎన్నికల ఫలితాల రోజే ధోనిముక్కల రోడ్డులోని పేదలకిచ్చిన ప్లాట్ల రాళ్లకు పచ్చ రంగు కొట్టించి కబ్జా చేస్తోంది టీడీపీ నాయకులేనన్నారు. అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే అత్యంత చెడ్డపేరు తెచ్చుకున్న చరిత్ర గుమ్మనూరు సోదరులదని ఆయన విమర్శించారు. మోసపూరితమైన హామీలతో గెలిచిన గుమ్మనూరు జయరామ్ చేత రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు. జయరామ్‌పై వెయ్యి ఓట్ల మెజార్టీతో తాను గెలవకపోతే జిల్లా విడిచివెళ్తానన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ప్రతిఘటిస్తామని ఆయన హెచ్చరించారు.మున్సిపల్ మాజీ చైర్మన్లు రామలింగప్ప, జింకల రామాంజనేయులు మాట్లాడుతూ ధోనిముక్కల రోడ్డు ప్లాట్లల్లో అక్రమాలు జరిగి ఉంటే అధికారుల చేత విచారణ చేయించి వాటిని ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలే తప్ప ఒకరిపై బురద చల్లడం సరికాదన్నారు. సోషల్ మీడియా కన్వీనర్ జయరామిరెడ్డి మాట్లాడుతూ తాను ఒకసారి ఎంపీటీసీగా, మరోసారి సర్పంచ్‌గా గెలిచానని, ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవలేని నారాయణ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. 200 ప్లాట్లల్లో 10 ప్లాట్లు కబ్జా చేశానని నిరూపించినా తాను రాజకీయాల నుంచి నిష్క్రమిస్తానని, ఈ సవాల్‌కు నీవు సిద్ధమేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లింగన్న, సుమోబాషా, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్.మోహన్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, నూర్‌నిజామి, సోమిరెడ్డి, తిక్కస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం నిర్వహణకు అనుమతి తప్పనిసరి



సీఐ వెంకటేశ్వర్లు

బుక్కరాయసముద్రం/పెద్దపప్పూరు/పెద్దవడుగూరు/గార్లదిన్నె: మొహర్రం (పీర్ల పండుగ) నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో పీర్ల పండుగ చేయాలనుకునేవారు ముందుగా కమిటీగా ఏర్పడి పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాలకు అవసరమైతే పోలీసు సిబ్బందిని బందోబస్తుకు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లోని మసీదులు, పీర్ల చావిడి వద్ద డీజేలు సౌండ్ సిస్టంకు అనుమతి లేదన్నారు. ప్రశాంతంగా పీర్ల పండుగను జరుపుకోవాలన్నారు. పీర్ల చావిడి రాత్రి సమయంలో గుంపులు గుంపులుగా డీజే సౌండ్లు తప్పెట్లతో డ్యాన్స్ చేయరాదన్నారు. పోలీసులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మందు తాగి డ్యాన్స్‌లు, వీరంగం సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలు జరిగినట్లయితే కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. అలాగే పెద్దపప్పూరు ఇన్‌చార్జి ఎస్‌ఐ గౌస్‌బాషా, పెద్దవడుగూరు ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప, గార్లదిన్నె ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ మొహర్రం పండుగను నిర్వహించే వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మొహర్రం ఉత్సవాలు ప్రారంభం



శింగనమలలో పీర్ల పెట్టెలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

శింగనమల: శింగనమలలో మొహర్రం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీర్ల చావిడిలోని పీర్ల పెట్టెలను అలంకరించి, గ్రామంలో ఊరేగించారు. ఆరు రోజుల పాటు రోజూ ఒక చావిడిలోని పీర్ల పెట్టెలను ఊరేగించనున్నారు. ఈ నెల 13 వరకూ పీర్ల పెట్టెలు ఊరేగిస్తారు. శింగనమలలో ఎనిమిది పీర్ల చావిడ్లలో 24 పీర్లను నిలుపుతున్నారు. ఈ నెల 14వ తేదీ శింగనమల, గోవిందరాయునిపేటలో పీర్లను ఊరేగిస్తారు. 15వ తేది శింగనమలలోని గోవిందరాయునిపేట, చిన్నజలాలపురం, గురుగుంట్ల పీర్లను ఊరేగిస్తారు. 16న అగ్ని గుండం కార్యక్రమం, 17న జలధి కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించండి



క్రిష్టిపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పెద్దవడుగూరు/పామిడి: ఉపాధి కూలీలకు కూలి డబ్బులు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మండల కార్యదర్శి కృష్ణనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడులో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రాంతానికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకొన్నారు. వారు మాట్లాడుతూ 8 వారాలుగా పెండింగ్ ఉన్న బిల్లులను కూలీలకు అందించాలన్నారు. పని దినాలు 200 రోజులకు పెంచాలన్నారు. కూలీలకు ఒక రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ మేట్ల కు పారితోషికం ఇవ్వాలని, అడిగిన వారందరికీ రాజకీయ జోక్యం లేకుండా పనులు కల్పించాలన్నారు. పనిముట్లు, సమ్మర్ అలవెన్స్ అదనపు వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో రంగస్వామి, పెద్దయ్య, ఆది, రంగయ్య, ఆచారి, సావిత్రి, శిరీష, వరలక్ష్మీ, బాలకృష్ణ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించలంటూ పామిడి ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిలాల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి మల్లేసు, శివకుమార్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సారోళ్లు ఎప్పుడు వస్తారో?



గ్రామ సచివాలయంలో ఉదయం 10:30కి కార్యదర్శి శోభారాణి ఒక్కరే ఉన్న దృశ్యం

యాడికి: గ్రామ సచివాలయ ఉద్యోగులు రోజూ సమయపాలన పాటిస్తూ విధులకు హాజరై ప్రజల సమస్యలు పరిష్కరించాలి. అయితే మండల కేంద్రంలోని వేములపాడు రహదారిలో ఉన్న నం:5 గ్రామ సచివాలయంలో మంగళవారం ఉదయం గ్రామ సచివాలయ కార్యదర్శి శోభారాణి ఒక్కరే హాజరయ్యారు. ఉదయం 10:35గంటలకు మహిళా పోలీసు ప్రతిభా భారతి, 10:37 గంటలకు సర్వేయర్ దావూద్, 10:45గంటలకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాస్నీం హాజరయ్యారు. మిగిలిన శాఖల ఉద్యోగులు 11 గంటల తర్వాత విధులకు హాజరయ్యారు. సమస్యల మీద వచ్చిన ప్రజలు గ్రామ సచివాలయం వద్దకు రావడం, సిబ్బంది లేకపోవడంతో సారోళ్లు ఎక్కడికి వెళ్లారో? ఎప్పుడు వస్తారో? అని చర్చించుకోసాగారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది అందరూ విధులకు హాజరైయ్యేలా, సమయపాలన పాటించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత



కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న దృశ్యం

గుంతకల్లు: మొక్కలు పెంపకం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శంకరనంద గిరి డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఏక్ పెడ్ మాతా కే నామ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లి పేరిట ఒక మొక్క నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశ్యంతో ఏటా రాజ్ ఫౌండేషన్ సభ్యులు మెరిట్ స్కాలర్ షిప్‌లను అందజేస్తున్నారు. అందులో భాగంగా గత ఏడాది పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురికి రూ.పది వేలు విలువ చేసే చెక్కు అందజేశారు. ర్యక్రమంలో రాజ్ ఫౌండేషన్ చైర్మన్ గోపాల్‌నాయుడు, వైస్ చైర్మన్ రామకృష్ణనాయుడు, కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గర్భిణికి సూచనలిస్తున్న డాక్టర్ అప్పయ్య

యాడికి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండలంలోని రాయల చెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి అప్పయ్య సూచించారు. మంగళవారం రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతి నెలా వైద్యుల సూచనల మేరకు చెకప్ చేయించుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హాజరైన గర్భిణులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మతల్లి గ్రామోత్సవం



దిమ్మగుడిలో మారెమ్మ తల్లికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు



పెద్దవడుగూరులో చౌడేశ్వరీదేవికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

పెద్దవడుగూరు: మండలంలోని దిమ్మగుడి గ్రామంలో మంగళవారం మారెమ్మతల్లి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మారెమ్మతల్లి, సుంకులమ్మతల్లి, కుంటెమ్మతల్లి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం ఎస్సీ కాలనీలో ప్రజలు బోనాలు మోసుకుంటూ అమ్మవారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప బందోబస్తు ఏర్పాటు చేశారు.

చౌడేశ్వరీదేవికి బోనాలు

పెద్దవడుగూరు మండల కేంద్రంలో చేనేత కాలనీ వాసులు మంగళవారం చౌడేశ్వరీ దేవికి ఆషాఢమాస బోనాలు సమర్పించారు. అంతకుముందు మహిళలు, చిన్నారులు బోనాలు మోసుకుంటూ అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ కమిటీ ఎన్నిక

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. పుట్లూరు రోడ్డులోని సత్యసాయి ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఎన్నికల్లో 68 ఓట్లతో ఏ ప్యానల్ అభ్యర్థులు రాజేష్ కుమార్, గోపాల్కృష్ణ, మస్తాన్‌వలి, మల్లికార్జునరెడ్డి, హాజీ విజయం సాధించారు.

నేడు సర్వసభ్య సమావేశం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిహించనున్నట్లు ఎంపీడీఓ శోభారాణి తెలిపారు. కార్యక్రమానికి ఎంపీటీసీ, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

గుత్తి: పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ కాలువలు, తాగునీటి పైప్ లైన్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

పామిడి: పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో వైద్యుడు శాహేల్ 250 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈసందర్భంగా 123 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం రోగులకు అన్నదానం నిర్వహించారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారిని బస్సులో బెంగళూరుకు తరలించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాప అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతి నాయుడు, క్లబ్ వైస్ గవర్నర్ డాక్టర్ విరుపాక్షరెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ రుఖియాబేగం, జిలాన్, డాక్టర్ మురళి, గుత్తి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, స్థానిక క్లబ్ సభ్యులు, వాసవీ కల్యాణ మండపం కమిటీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన అక్షయ్

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అమరావతి హోటల్ వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో అక్షయ్, యోగేందర్ అనే యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన అక్షయ్, యంగన్నపల్లికి చెందిన యోగేందర్ అనే ఇద్దరు స్నేహితులు బైక్ వద్ద నిలబడి ఉండగా మరో బైక్ వచ్చి ఢీ కొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్షయ్ కాలు విరగడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బైక్ బోల్తా: ఒకరికి గాయాలు

గుత్తి పట్టణంలోని ఆర్ఆర్ హోటల్ వద్ద మంగళవారం బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జెడ్ వీరారెడ్డి కాలనీకి చెందిన మధు అనే యువకుడు గాయపడ్డాడు. స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించారు.

వృద్ధుడి మృతి

పుట్లూరు: మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు (78) మంగళవారం మృతి చెందాడు. ఈ నెల 7న వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని బంధువులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. అయన కుమారుడు నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



గాయపడిన నాగార్జున

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం బోల్తాపడి నాగార్జున అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. యాడికి మండలం పిన్నేపల్లికి చెందిన నాగార్జున అనే వ్యక్తి పని నిమిత్తం గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా తొండపాడు గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు నాగార్జునను అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్‌యార్డు చైర్మన్ పదవి ఎస్టీలకు కేటాయించాలి

పామిడి: గుత్తి మార్కెట్‌యార్డు చైర్మను పదవిని ఈసారి ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించాలని ఏపీ బంజారా గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రమావత్ సురేష్‌నాయక్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెనుకబడిన వర్గానికి ఈ పదవిని కేటాయించడం వల్ల ఎస్టీలకు సముచిత స్థానం కల్పించిన వారవుతారన్నారు